# శ్రీ సాయిభక్తి మకరంద మాల



శ్రీ సాయి

# ముందు మాట

ఒక నిజం చెప్పాలి.మొదట నాకు సాయి బాబా మీద భక్తి లేదు కానీ నా అర్ధాంగి మంచి సాయి భక్తురాలు.తనకోసం ఏమైనా చేద్దాం అని ఆలోచించాను. తనకు డబ్బుతో కొనలేనిది,అతి విలువైంది ఏది అని ఆలోచించాను.వెంటనే నాకు తట్టింది"సాయి భక్తి" అని. మతాల కతీతంగా నేటి తరానికి దైవ స్వరూపం సాయి బాబా అన్నది అందరూ అంగీకరించే విషయం. పుస్తకం చివరిలో చెప్పబడిన వేరువేరు సాయిపుస్తకాల నుంచి సంగ్రహించినది ఈ భక్తి మకరందం. నేటి తరానికి శ్రీ సాయి భక్తి మార్గం తెరచి ఉంచాలి అనే సదుద్దేశాన్ని కూడా ఈ పుస్తకం పూర్తి చేస్తుంది. అలా నా నమ్మకం మొదలయింది.

రచయిత,

రొండా మధు.

శ్రీ సాయి సచ్చరిత్రము

మహారాష్ట్ర ప్రదేశములోని వారందరికి శ్రిగురుచరిత్ర సుప్రసిద్ధము. ఆ ప్రదేశమంతటను దత్తాత్రేయ భక్తులు దీనిని చదివెదరు. కొందరు దీనిని నిత్య పారాయణము చేసెదరు.

నేటి గురుచరిత్ర

ఇందులో శ్రీపాద శ్రీవల్లభ స్వామి యొక్కయు, శ్రీ నరసింహ సరస్వతి స్వామి యొక్కయు లీలలను విచిత్ర చర్యలును వర్ణింపబడి యున్నవి. వీరిద్దరు దత్తాత్రేయుని ముఖ్యావతారాలు. ప్రముఖ మరాటి గ్రంధకర్తయగు శ్రీ యల్.ఆర్.పాంగార్ కర్ అభిప్రాయము ప్రకారము ఈ రెండవతారములు 14, 15 శతాబ్దములలో వెలసెను. దత్తాత్రేయుని తదుపరి యవతారములు కూడా గలవు. ఇందులో ముఖ్యమైనవి నైజాము ఇలాఖాలో శ్రీ మాణిఖ్యప్రభువును, షోలాపూరు జిల్లాలో శ్రీ అక్కల్ కోటకర్ మహారాజ్ గారు, తుట్ట తుదకు అహమదు నగరు జిల్లాలోని శిరిడీలో శ్రీ సాయిబాబా యును. బాబా 1918 వ సంవత్సరములో మహాసమాధి చెందిరి. శ్రీ అక్కల్ కోటకర్ మహారాజ్ అవతార పరంపరయే శ్రీ సాయిబాబాయని కొందరి

భక్తుల నమ్మకము. అయిదవ యధ్యాయములో వేప చెట్టు క్రింద పాదుకలు ప్రతిష్టించిన కధయు, ఇరువదియారవ యధ్యాయములో చెప్పబడిన హరిశ్చంద్ర పితళే అనుభవమును ఈ నమ్మకమును ధృఢపరుచుచున్నవి.

పైన వివరించిన రెండు అవతారముల విచిత్రలీలలను శ్రీ గురుచరిత్రయను గ్రంధమందు 53 అధ్యాయములలో సరస్వతీ గంగాధరుడెట్లు వర్ణించెనో యటులనే శ్రీ గోవింద రఘునాద్ ఉరఫ్ అన్నాసాహేబు దాబోల్కర్(హేమంత్ పంతు) అను వారు శ్రీ సాయి లీలలను 53 అధ్యాయములలో శ్రీ సాయిసచ్చరిత్రమను గ్రంధమున వర్ణించియున్నారు. కనుక నీ శ్రీ సాయి సచ్చరిత్రము యీనాటి "గురుచరిత్రయ"ని చెప్పవచ్చును.

<u>గమనిక</u>

ఈ ప్రస్తుత పుస్తకము సరిగా పారాయణము చేసికొనుట లాభదాయికము, యిది నేటి వాడుక భాష కాక పోయినా, అందరికి అర్ధమయ్యే భాషలోవ్రాయబడి ఉన్నది. దీని మూల గ్రంధము శ్రీ సాయిసచ్చరిత్ర రచయిత ధాబోల్కర్ స్వయంగా పలు సాయి లీలలను చూసారు, అనుభవించారు. కాబట్టి నమ్మకముతో సాయి భక్తి మార్గము పట్టుట లోనే మనకు ఉపయోగ ఫలితములు దాగి ఉన్నవి.

సాయి భక్తి పారాయణం చాలా విధాలుగా చేయవచ్చును.

1. 54 అధ్యాయముల మొత్తము ఒక రోజులో పారాయణము చేయవచ్చును.
2. 1-27 అధ్యాయములు ఒక రోజు , 28-54 అధ్యాయములు రెండవరోజునపారాయణ చేయవచ్చును.
3. 1-18 అధ్యాయములు ఒకటవరోజున, 18-36 అధ్యాయములు రెండవరోజున,37-54 అద్యయములు మూడవ రోజున పారాయణ చేయవచ్చును.
4. రోజుకు 6 అధ్యాయముల చొప్పున తొమ్మిది రోజులలో 54 అధ్యాయముల పారాయణము చేయవచ్చును.
5. రోజుకు 5 అధ్యాయముల చొప్పున 10 రోజులు, ఆఖరి రోజున 4 అధ్యాయములు పారాయణ చేయవచ్చును.
6. 54 రోజులు రోజుకు 11 అధ్యాయములు చొప్పున 11 సార్లు పారాయణము చేయవచ్చును.

| ప్రత్యేక ఫలితములకై పారాయణము చేయవలసిన సంఖ్య, నైవేద్యము | | |
|---|---|---|
| **ఫలితములు** | **ఎన్ని మార్లు** | **నైవేద్యము** |
| 1.ఆరోగ్యము | 5 మార్లు | పొంగలి ప్రసాదము మిరియాలు వేసి చేసినది |
| 2.ఆనందము | 2 మార్లు | అరటి పళ్ళు ఆరగింపు |
| 3.ఉద్యోగము | 4 మార్లు | పొంగలి ప్రసాదము |
| 4.వివాహము | 8 మార్లు | పులిహోర నైవేద్యము |
| 5.సంతానము | 11 మార్లు | చక్కెర పొంగలి |
| 6.సకల కార్య జయం | 15 మార్లు | బియ్యం పరమాన్నం |
| 7.దోష విముక్తి | 1 మారు | శనగలు నైవేద్యం |
| 8.భయాలు తొలగుట | 3 మార్లు | టెంకాయ నైవేద్యం |
| 9.మిత్రత్వం | 6 మార్లు | అటుకులు,బెల్లం |
| 10.శత్రు వినాశనము | 7 మార్లు | కలకండ నైవేద్యం |
| 11.ధన లాభము | 13 మార్లు | పాలకోవా ప్రసాదము |
| 12.ఋణ విముక్తి | 9 మార్లు | ఉండ్రాళ్ళు నైవేద్యము |
| 13.దరిద్ర నిర్మూలన | 12 మార్లు | కొబ్బరి |
| 14.వ్యాపారాలు | 10 మార్లు | అన్న దానము |
| 15.మనో వాంఛలు | 14 మార్లు | అప్పాలు ప్రసాదము |
| 16.మనశ్శాంతి | 20 మార్లు | దద్దోజన ప్రసాదము |
| 17.గృహ శాంతి | 17 మార్లు | వడపప్పు-పానకము |

| | | |
|---|---|---|
| 18.కళలో గుర్తింపు | 19 మార్లు | మిఠాయిలు ప్రసాదము |
| 19.ప్రయాణాల శ్రేయస్సు | 18 మార్లు | గోధుమ రొట్టెలు |
| 20.భక్తి పెరుగుటకు | 16 మార్లు | పాలు-పంచదార |
| సాయి మందిర నిర్మాణ సమయములో 11 మార్లు పులిహోర-ఖర్జూరం నైవేద్యము | | |

# శ్రీ సాయి భక్తి పారాయణ గ్రంధము

## 1 వ అధ్యాయము

శ్లో|| గురుర్బ్రహ్మ గురుర్విష్ణు గురుర్దేవో మహేశ్వర
గురుస్సాక్షాత్ పరం బ్రహ్మ తస్మైశ్రీ గురవే నమః

శుక్లాంబరదరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం
ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోప శాంతయే

సదా సత్ స్వరూపం చిదానందకందం
జగత్ సంభవ స్థాన సంహార హేతుం
స్వ భక్తేచ్ఛయా మానుషం దర్శయంతం
నమామీశ్వరం సద్గురుం సాయినాదం

శ్లో|| ఆనంద మానందకరం ప్రసన్నం
జ్ఞాన స్వరూపం నిజ బోధయుక్తం
యోగీంద్ర మీద్యం భవరోగ వైద్యం
శ్రీ సద్గురుం నిత్య మహం నమామి
శ్లో|| సదా కల్ప వృక్షస్య తస్యాధి మూలే
నృణం కుర్వతాం భుక్తి ముక్తి ప్రదంతం
నమామీశ్వరం సద్గురుం సయినాధం ||

## పారాయణ ఫలము

శ్రీ సాయి బాబా సచ్చరిత్రము సముద్రంలా విశాలమైనది,అట్లే లోతైనది కూడా.దీనిలో మునిగిన వారంతా భక్తి చేత శోధించి జ్ఞానం అనే మణులను సాధించి ఇతరులకు పంచి పెట్ట వచ్చు.బాబా యొక్క నీతి బోధకములయిన కథలు లీలలు పాటకులకు మిక్కిలి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంటాయి.ఇహపరముల కవసరమయిన బుద్ధిని,జ్ఞానాన్ని ప్రసాది స్తాయి.ఈ సాయి సచ్చరిత్ర చదవటం-వినటం-తెలుసుకోవటం-మననం చేయటం అనేవి సాక్షాత్ బ్రహ్మైక్య భావన, ధ్యానానందం, అష్టాంగ యోగ ప్రావిణ్యాలను భక్తులకు కలిగిస్తాయి.

అట్టి వారి భయాలు తొలగటమే కాక మనోవైకల్యాలు నశిస్తాయి.అవిద్య అంతమౌతుంది.

ఎవరైతే ఈ గ్రంధాన్ని శ్రద్ధాపూర్వకంగా చదువుతారో, వింటారో వారికి బాబా యందు గాడమయిన భక్తి విశ్వాసం ప్రేమానురాగాలు ఏర్పడతాయి.ఈ మాయమయ సంసారం సాగరాన్ని అవలీలగా ఈదగలుగుతారు.

“ఓం శ్రీ సాయినాదాయ నమః”

# 2 వ అధ్యాయము

## గురుభ్యోనమః

నిజమునకీ జీవుడు సత్వ రజస్తమో గుణములు-మూడింటికినీ అతీతుడయి ఉండి కూడా మాయచే కప్పబడి యున్న కారణముగా తన నైజమగు సత్ చిత్ ఆనందమును విస్మరించి-భ్రాంతియే సత్యముగా తలంచి ద్వంద్వ స్వభావమునకు తల వంచి ఈ తాపత్రయాదులకులోనై చతుర్విధ పురుషార్థ సాధనమును త్యజించి పంచేంద్రియ విషయానుభవములకు మ--గి అరిషడ్వర్గములచే దెబ్బతీయబడి, సప్తవ్యసనముల మత్తునందు మునిగి అష్టకష్టముల పలునూ యగుచు మసలుచున్నాడు.ఇట్టి కష్ట నిష్టూరమైన సంసార వేదనలన్నిటి నుండియు మనలను బయట పడవేయగల శక్తి ఓర్పు గురువునకు మాత్రమే ఉన్నది.విముక్తిని కోరువారికి గురు చరణములు ఆశ్రయించుట కంటే వేరు మార్గము లేదనునది ప్రాజ్ఞులేల్లరును అంగీకరించిన సత్యము.

‘గు’ అనగా చీకటి ‘రు’ (అందునుండి) తప్పించునది అనగా అజ్ఞానమను చీకటి నుండి తప్పించు వారే గురువులు.అట్టి గురువులకు సర్వస్వ శరణాగతి చేయనిదే మానవునకు విముక్తి కలుగుట అసాధ్యము.తాము అవతార పురుషులైనప్పటికీ రాముడు వశిష్ట విశ్వామిత్రులను, కృష్ణుడు సాందీపుని తమ గురువులుగా భావించి సేవించిన వారే కదా! కురుక్షేత్రము నందు అర్జునుడు శ్రీకృష్ణుడిని సద్గురువుగా సేవించి భగవద్గీత అనే గొప్ప ‘అపార జ్ఞాననిధి’ ని పొందగలిగాడు. శంకర భగవత్పాదులు గోవింద గురువులను కొలుచుట, రాఘవేంద్రులు సురీంద్రులకు సుశ్రుష చేయుట, వివేకానందులు రామకృష్ణ పరమహంసకు శిష్యులగుట ఇవ్వన్నియు గురువు యొక్క గొప్పతనమును, ఆవశ్యకతను చాటిచెప్పుచునే యున్నవి. ‘గురువు లేని విద్య కూడిరాదు’ అనే నానుడి మన మేరిగినదే కదా.ఎవరికి వారే చదువుకొని పరీక్షలందు ఉత్తీర్ణులగుటకు ఆద్యాత్మిక మార్గము లౌకిక విద్య కాదు కదా! కావునా ఈ జీవుడు ఇహపరములు సాధించవలెనన్నచో సద్గురువును ఆశ్రయించుట యొక్కటే శరణ్యము. అట్లాశ్రయించిన శిష్యులను సన్మార్గమున నడిపించి,తమ నైజములోనికి తరలించువారే సద్గురువులు-అట్టి సద్గురువులలో నెల్లసర్వోత్తములగు శ్రీ దక్షిణామూర్తి వారికినీ, దత్తాత్రేయుల వారికినీ శంకరాచార్యుల వారికినీ, శ్రీ షిరిడీ సాయిబాబా వారికినీ నా గురు పాదులకు శ్రద్ధాళువునై ప్రణమిల్లుచున్నాను.

"ఓం శ్రీ సాయినాదాయ నమః"

# 3వ అధ్యాయము

## భక్తవరదాయి సద్గురు శిరిడి సాయి

సద్గురు పాదులయిన శ్రీ శిరిడి సాయిబాబా వారి దయా వీక్షణములకు అంతము లేదు. వారి అనుగ్రహము వలననే విద్యాపాటవము తక్కువయిననూ షేవడే అనునతను న్యాయవాద పరీక్షయందును గ్రహచారము బాగులేకున్ననూ బాబా తెండుల్కరు అను వాడు వైద్య పరీక్షయందును, ఇంకా అనేక మది విద్యార్ధులు తమ తమ పరిక్షలలోనూ ఉత్తీర్ణులైనారు. ఎందరికో వివాహము లైనవి .అనేక మంది నిరుద్యోగులకు ఉద్యోగములు లభించినవి, ఉద్యోగులకు ఉన్నత పదవులు లభించినవి, మరి కొందరకు వారి కొలువులు శాశ్వతములైనవి. గంగాధర పంత్, నానా సాహెబ్ చాందోల్కర్ లాంటి వారెందరో బాబా అనుగ్రహముచే ఆరోగ్యవంతులైనారు. పేదవారి దరిద్రములు తొలగిపోయినవి. దరిద్రులు ధనికులైనారు. ధనికులు మరింత ధనికులు గాను ధర్మాత్ములు గాను అయ్యారు. యోగసాధకులు సిద్ధిని పొందినారు. కవి,గాయక,కళాకారులు అనేకులు ఉద్ధరింప బడినారు. తన భక్తుల ఇంటిలో తిండికినీ, బట్టకునూ కరువు రానీయనని శ్రీ సాయి బాబా నే స్వయంగా ప్రతిజ్ఞా పూర్వకంగా చెప్పియున్నారు.శిష్యులు అర్జునులైనచో బాబా సాక్షాత్తు శ్రీ కృష్ణ పరమాత్ములే. వారి భక్తులకు వారు చింతామణి రత్నము, కామధేనువు, కల్పవృక్షముల కంటే అధికులు. ఆశ్రితులకు అన్నపూర్ణ వంటివారు, దీనుల పాలిట దయా సముద్రులు అమృత తుల్యమగు బాబా బోధనలనూ, హితవచనములనూ అద్భుతములగు వారి లీలలను విననవారికిని పఠించిన వారికినీ కూడా శ్రీ సాయి బాబా సాక్షాత్ భగవత్ స్వరూపులేనను విషయము ఖచ్చితముగా తెలియగలదు.

మాధవరావు దేశ్ పాండే ఉరఫ్ శ్యామ సాయి బాబా నే తన గురువూ, దైవముగా భావించి ఆరాధించినారు. అతను ఎల్లపుడూ బాబాను దేవా యనియే సంబోధించేడివాడు. పండరీ విఠల దేవుని భక్తుడునూ, 95 సంవత్సరముల వృద్దుడునూయగు గౌలిబువా అనునతను సాయిబాబాను విఠలుని అవతారముగా ప్రకటించినాడు. ప్రముఖ హరికధకుడైన దాసగణు మహారాజ్ బాబాను సృష్టి స్థితి లయ కారకునిగా, ప్రత్యక్ష పరమాత్మగాను అభివర్ణించే వారు.ఆయన చమత్కారములను, లీలలను మహిమలను తెలిసిన ఎందరో ఆయనను రామునిగానూ శివునిగానూ ఆంజనేయ స్వామిగాను కూడా భావించి, అర్చించి తరించినారు. ఎందరో ఆయనను యోగి చక్రవర్తిగా గుర్తించి ఆరాధించినారు. మహ్మదీయులు ఆయనను పీరులలో ఒకరిగా గౌరవించుకొనినారు.

ఎవరో కొందరు మాత్రమాయనను పిచ్చి ఫకీరనియు పొట్టకూటికై వేషము కట్టి బిచ్చమెత్తు కొనుచున్నాడనియు గేలి చేసిన ఘట్టములు కూడా ఒకటి రెండు లేక పోలేదు. కానీ తదుపరి కాలములో దూషించిన వారే తమ దోషములను తెలుసుకొని బాబా ను ఆశ్రయించినారు. ఆయన పరమాత్మ స్వరూపులేనని

ఎలుగెత్తి ఘోషించినారు.సరియే ఎవ్వరేమనుకున్నానూ బాబా ఖ్యాతి మాత్రము కించిత్తుయునూ తగ్గలేదు. వారి మహిమలు ప్రపంచ వ్యాప్తము కాక మాన లేదు. వారి భక్తుల సంఖ్య దినదిన ప్రవర్ధమానమగుట నాడునూ, నేడునూ కూడా చూస్తూనే యున్నాము. సర్వజ్ఞుడునూ, సర్వంతర్యామి యునూ అగు శ్రీ సాయి బాబా మనలను కరుణించు గాక. “జై శ్రీ సమర్ధ, సద్గురు సాయినాధ మహారాజ్ కూ జై”

# శిరిడి

మహారాష్ట్రమందలి అహ్మద్ నగర్ జిల్లాలోని గోదావరీ నదీ పరివాహ ప్రాంతములు అత్యంత పుణ్యవంతములును, జ్ఞానేశ్వర్ వంటి మహాయోగులకు పుట్టినిల్లు అయి ఉన్నవి. ఆ జిల్లాలోనే గల కోపర్ గావ్ తాలూకాలోని ఒక కుగ్రామమే శిరిడి. దీనినే పూర్వము “శిలధి” అని పిలచెడి వారు. రాను రాను ప్రజల వాడుక లో నలిగి “శిలధి” శబ్దమే శిరిడీగా పరిణమించినది. ఈ శిరిడీయే శ్రీ సాయి బాబా వారి సమాధి స్థానము. మహా భక్తుడగు రామాజీ-మంగళవేధ యందును సమర్ధ రామదాస స్వామి సజ్జన ఘడ మందును, శ్రీ నరసింహాసరస్వతీ స్వామి నర్సోబాచీవాడీ యందును, శ్రీ శంకరాచార్యులు కామకోటియందునూ, శ్రీ రాఘవేంద్రులు మంత్రాలయము నందును శ్రీ సమర్ధ సద్గురు సాయి బాబా శిరిడీలో వర్ధిల్లినారు.అలందిని జ్ఞానేస్వరుడు, పైఠనును ఏకానాధుడు అభివృద్ధి పరచినట్లే బాబా శిరిడీని పవిత్రమొనర్చి అభివృద్ధి పరచినారు. శ్రీ సాయి నాధుని ఉనికి వలననే కాశీ రామేశ్వరము వలే, గయా ప్రయాగలవలే, బదరీ హృషికేష్ ల వలే, పండరీ జగన్నాధములవలే శిరిడీ కూడా ఒక పుణ్య క్షేత్రము గా విలసిల్లుచున్నది.

**“ఓం శ్రీ సాయినాదాయ నమః”**

# 4 వ అధ్యాయము

## శిరిడీలో బాబా తొలి సాక్షాత్కారము

ఈనాటి భాషావ్యవహారమును బట్టి చెప్పవలెనన్నచో –ఆనాటికి వెనుకబడిన గ్రామములన్నిటి యందునా వెనుక బడిన గ్రామము శిరిడీ. అది 1854వ సంవత్సరము. ఒకనాడా గ్రమమందలి ఒకానొక వేపచెట్టు క్రింద తపస్సాచరించుచున్న 16 సం||ల కుర్రవాడొకడు హటాత్తుగా సాక్షాత్కరించినాడు. చూచుటకు బాలుడేయైనను చాపల్యములను లేక నిర్మోహిగనూ, నిర్వికల్పునిగాను, నిర్వికారునిగాను తోచేడివాడు. ఎవరితోనూ కలువక (నిస్సంగుడై) చలికినీ, ఎండకునూ చెదరక(సమస్తుడై), రాత్రులందు సైతము ఒంటరిగానే(నిర్భీతుడై) ఉండెడివాడు. ఆ కుర్రవాని పుట్టు పూర్వోత్తముల గురించి గాని, ఊరూ పేరూ గురించి గానీ ఎవరెంత ప్రశ్నించినను జవబిచ్చెడి వాడు కాదు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Sri+Sai+Bhakti+Makaranda+Mala](http://kinige.com/book/Sri+Sai+Bhakti+Makaranda+Mala)**

* * *